

# 3 కర్తవ్యం

మర్నాడు సుబ్బరాజు వచ్చి కూర్చుని ఏదో చెప్పబోయేవరకు, రెడ్డిగారతన్ని చే సైగతో వారించి "ఈ కథ విప్పు ముందు" అన్నారు హుందాగా.

రెడ్నాయుడు కొడుకు రావిసెట్టి కూతురు మీద మనసు పడి, మనువాడతానని ప్రతిజ్ఞ పట్టి, తలగట్టుకు పడుకున్నాడు. తండ్రి ఎంత జెప్పినా వినలేదు. గత్యంతరం లేక నాయుడోనాడు సెట్టి బవంతి కెళ్ళి మెల్లిగా విషయం కదలేశాడు. సెట్టి విరగబడి నవ్వాడు.

"ఒర్ణ సంకరమ్మాటటుంచి, అసలు నా అంతస్తేటి, నియ్యంతరవేటి. అడేదో కుర్రకుంకడిగాడే అనుకో - నివ్వెట్టా ఒచ్చి నన్నడిగావు. ఇదేం జరిగేదనేనా నీ ఊహ" అవటాని దులిపేశాడు. మాటా మాటా వచ్చింది.

"నీ కత నాకు తెల్దా. నువ్వు మినిస్ట్రుగారి మేనల్లుడి కోసం యగబట్టంలేదా, అది నీకు పయ్యంతస్తుగాదా. నేనే మినీస్ట్రునైతే నివ్విట్టా మాట తూలేవోడివా, ఇష్టం లేదనక ఇయ్యన్నీ ఎందుకెత్తుతావూ?" అని ఎదురు దిరిగాడు రెడ్నాయుడు.

శెట్టి పగలబడి నవ్వి, "నువు మంత్రివైతే నే రాజు నౌతా దానికేటిలే" అన్నాడు.

"అవుతా వవుతా వెందుకవ్వూ. ఈ ఊరు పంచాయితీగా ఏడిసి సన్నాళ్ళు రాజువి నువుగాకింకెవరూ. అదీ చూద్దారెన్నాళ్ళో" అన్నాడు నాయుడు ఉక్రోషంగా.

సెట్టి జవాబు కూడా చెప్పలేదు. పద్దులు చూసుకుంటూ కూర్చున్నాడు. రెడ్నాయుడు ఈ పరాభవం తట్టుకోలేక పోయాడు. కుర్రతన పౌరుషం కమ్ముకొచ్చేసింది.

లేచి గుమ్మందాకా వెళ్ళి వెనక్కి తిరిగి, "నీ కళ్ళెదుట నేను మినీస్ట్రవపోతే ఈ వూరు మునిసిపాల్టీ అయినంతొట్టు" అన్నాడు.

"నా కంటంలో పాణవుండగా అంత పన్జరగ"దన్నాడు సెట్టి.

"చూడవుతానో కానో" అన్నాడు నాయుడు.

"నీసంగతి నాకేటి మద్దన, మున్సిపాల్టీ మాట జెబుతున్నా, కావలిస్తే ఊరు చుట్టూ కందకం తవ్వించి కోట గోడలు కట్టేసి పెరక్కుండా చేస్తాగానీ దీన్ని మున్సిపాల్టీ జేయనివ్వను" అన్నాడు సెట్టి.

మాట సాంతం వినకుండానే వెళ్ళిపోయాడు నాయుడు. విశ్వామిత్రుడిలా తానూ ఓ ప్రతిజ్ఞ పట్టాడు మినిస్టరనిపించుకోవాలని.

లోగడ కొన్నాళ్ళు రాజకీయాల్లో తిరిగి చెయి గాల్చుకు ఒళ్ళు పసిలేక తగ్గిపోయాడు. ఇన్నాళ్ళకు తిరిగి పౌరుషంగా రచ్చకెక్కాడు.

పన్దరగడానికి ముందు పార్టీలో చేరాలి. పార్టీలు మూడున్నాయి గాని ఛాన్సున్నవి రెండే. క, ఖ అనుకుందాం. రెంటిలోనూ ఎక్కువ ఛాన్సున్నది ఖ అని తేలింది. అందులో పెద్ద తనక్కావలసినవాడు కూడా. లోగడ తనవల్ల ఉపకారం పొందాడు. ఇప్పుడు బాగా పెద్దవాడు.

వెళ్ళి మాటాడాడు. కడుపులో ఊహలు ముందరే వెళ్ళబోసుకోడం లౌక్యం, రాజకీయం గాకపోయినా, ఉండబట్టలేక సంగతంగా చెప్పేశాడు.

"దానికేం? చూద్దాం. కాని ఖర్చు తడిసి మోపెడవుతుంది. పంచాయితీ మునిసిపలు ఎన్నికలున్నాయి ఎదర. ఇపుడు వీటికి కొంత డబ్బెట్టి సాయంచేస్తే ఆకట్టుకోవచ్చు. అది జరిగితేగాని అనక మన మొఖం జూసేవాడుండడు మరి" అన్నాడు నాయకుడు.

"సరే" అన్నాడు నాయుడు మర్నాడొచ్చి.

నాయుడేమంత లేనివాడు కాడు. ఇతగానికన్న సెట్టిదొక్క అంతస్తే ఎక్కువ. అతని మేడకి రెండంతస్తులున్నాయి. ఉన్నంతలో పుట్టించగలిగినంత పొగేసి, కొంత తెగనమ్మి సిద్దపడ్డాడు నాయుడు యుద్ధానికి. అక్కడి నుంచి ఊహా ఇంటికొచ్చేవాళ్ళూ, పోయేవాళ్ళూ, ఊళ్ళు తిరగడాలూ, మీటింగులూ, ఒత్తడాలూ, తడపడాలూ, పత్రికలూ, రాతలూ, కోతలూ, కూతలూ, వెవహారం అంతా మూడో కాలంలో పడింది. గ్రూపులు కలుస్తున్నాయి. విడుతున్నాయి. నాయుడు ఒక చదువుకున్నాయన్ను కుదుర్చుకుని మంచీ, చెడ్డా, శాస్త్రం, పార్టీ, కథా కమామీషూ నేర్చుకున్నాడు. ఆట, పై యాట, పట్టూ విడుపూ, కుడీ ఎడవా – అన్నీ తన నాయకుడి దగ్గర నేర్చుకున్నాడు. అన్నిటికీ నాయకుడే గురి, ఆయన గీచిన గీటు దాటకుండా నడుచుకున్నాడు. పేరు పేపర్లలో తరచూ పడుతూంది.

ఒకసారి ఒక డెలిగేషనులో చేర్పించాడు నాయకుడు – ఓసారెళ్ళిరా నాయుడూ, పొరుగుదేశం వెళ్ళొస్తే ప్రిష్టీజి పెరుగుద్ది అన్నాడు. నాయుడు వెళ్ళాడు.

ఆరువారాల తరవాత తిరిగొచ్చేసరికి కథ అడ్డం తిరిగింది. పార్టీలో చీలికలొచ్చాయి. క పార్టీ జనం కొందరు ఖ లో కలిశారు. ఖ వాళ్ళు క లో కలిశారు. కొందరు ఎటూగాక మూడో పార్టీలో చేరారు. కొందరు నాలుగోది కట్టుకున్నారు. నాయుడు పార్టీ ఆఫీసు కెళ్ళేసరికి నాయకుడు లేడన్నారు. అతన్ని దుమ్మెత్తి పోశారు. భ్రష్టుడు దుష్టుడు ద్రోహి వెళ్ళి అందులో కలిశాడన్నారు.

రెడ్నాయుడికి దారి తోచలేదు. తిన్నగా ఇంటికెళ్ళిపోయాడు – ఎవణ్ణి సలహో అడిగితే ఏమవుతుందోనని. అతన్ని ఒక సమస్య పట్టుకుంది. తను ఇన్నాళ్ళూ ఉన్న పార్టీలోనే ఉండడమా? లేక నాయకుడు కొత్త దాంట్లో చేరాడు గాబట్టి తనూ అందులోకే వెళ్ళడమా? నాయకుడి తెలివితేటల మీద, రాజకీయంలో ఉండే ప్రజ్ఞ మీద తనకు ఎంతో గౌరవం. ఆయన పద్ధతులు మంచివి. వాటివల్ల దేశానికీ మేలు కలుగుతుంది... మరి ఇన్నాళ్ళూ ఆయన నడిపిన పార్టీ కూడా మంచిదే. ఆయన పద్ధతులేగదా అదీ అనుసరించింది? తనేం చెయ్యాలి. ఎవరితో కలవాలి? ఇదీ చిక్కు.

☆ ☆ ☆

"సుబ్బరాజా. నువ్వు గట్టివాడవైతే ఈ చిక్కు విప్పాలి. నువ్వే నాయుడివైతే ఏం చేస్తావు? చెప్పు?" అన్నారు రెడ్డిగారు కథ ఆపి.

"పార్టీ లక్ష్యాలు, దేశం మేలుకన్న మినిస్టరవడం ముఖ్యం. పార్టీ ఏదైనా చేస్తాననే దాకలే. ఎవరు చేసినా మానినా జరిగేదెలాగూ జరుగుతుంది. దేశంలో పన్లూ పార్టీ పాలిసీలనుబట్టి కాదు; మనుషుల పాలిసీలను బట్టి జరుగుతాయెప్పుడూ: అందువల్ల నాయుడు ఇలాగే ఆలోచించి ఉంటాడు. ఇకపోతే శరీరంలో తలను ఉత్తమాంగం అన్నారు. పార్టీలకీ అంతే. నాయకుడు ముఖ్యం కాబట్టి రెడ్నాయుడు పార్టీల వెంటగాక, తనకి ఆసరా ఉండి ఆదుకుంటున్న నాయకుడితోనే కలిసి ఉంటాడు. అత నే పార్టీ అయితే తనూ ఆ పార్టీయే కావాలి. అదే లాభసాటి. అదే జరగాల్సింది. అదే జరుగుతున్నది" అన్నాడు సుబ్బరాజు.

రెడ్డిగారు చుట్టపారేసి తల దాటించి వెనక్కు తిరిగి వెళ్ళిపోయారు.

★ ★ ★